



స్ట్రాంగ్ రూములను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్, జెసి నారపురెడ్డి మౌర్య

ఇవిఎంలలో భవితవ్యం

- స్ట్రాంగ్ రూముల్లో ఇవిఎంలు - మూడంచెల భద్రత ఏర్పాటు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. అభ్యర్థుల భవితవ్యం ఇవిఎంలలో నిక్షిప్తమైంది. ఇవిఎంలను స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. అధికారులు ఎప్పటికప్పుడు వాటిని పరిశీలిస్తున్నారు..

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రెండు పార్లమెంట్, 14 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈనెల 13న పోలింగ్ నిర్వహించిన విషయం తెలిసిందే. పోలైన ఓట్లకు సంబంధించిన వివరాలన్నీ ఇవిఎంలలో నిక్షిప్తమయ్యాయి. కర్నూలు జిల్లాకు సంబంధించిన కర్నూలు పార్లమెంట్, ఆదోని, ఆలూరు, పత్తికొండ, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు, కర్నూలు, పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గాల ఇవిఎంలను రాయలసీమ యూనివర్సిటీలో భద్రపరిచారు. నంద్యాల జిల్లాకు సంబంధించిన నంద్యాల పార్లమెంట్, నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, డోన్, శ్రీశైలం, నందికొట్కూరు అసెంబ్లీ నియోజకవర్గాల ఇవిఎంలను నంద్యాల ఆర్‌జిఎం, శాంతిరామ్ కళాశాలల్లో భద్రపరిచారు. వీటి కోసం ప్రత్యేకంగా స్ట్రాంగ్ రూములను ఏర్పాటు చేశారు. పాణ్యం నియోజకవర్గానికి సంబంధించిన ఇవిఎంలను రాయలసీమ యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ బ్లాక్‌లో భద్రపరిచారు. కర్నూలు నియోజకవర్గానికి సంబంధించిన ఇవిఎంలను రాయలసీమ యూనివర్సిటీలోని లైఫ్ సైన్సెస్ బ్లాక్‌లో భద్రం చేశారు. పత్తికొండ నియోజకవర్గానికి సంబంధించిన ఇవిఎంలను రాయలసీమ యూనివర్సిటీలోని లైబ్రరీ బ్లాక్‌లో భద్రపరిచారు. కోడుమూరు నియోజకవర్గానికి సంబంధించిన ఇవిఎంలను రాయలసీమ యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ బ్లాక్‌లో భద్రపరిచారు. ఎమ్మిగనూరు నియోజకవర్గానికి సంబంధించిన ఇవిఎంలను రాయలసీమ యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ బ్లాక్‌లో భద్రపరిచారు. మంత్రాలయం నియోజకవర్గానికి సంబంధించిన ఇవిఎంలను రాయలసీమ యూనివర్సిటీలోని లైబ్రరీ బ్లాక్‌లో భద్రం చేశారు. ఆదోని నియోజకవర్గానికి సంబంధించిన ఇవిఎంలను రాయలసీమ యూనివర్సిటీలోని లైఫ్ సైన్సెస్ బ్లాక్‌లో, ఆలూరు నియోజకవర్గానికి సంబంధించిన ఇవిఎంలను రాయలసీమ యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ బ్లాక్‌లో భద్రపరిచారు. స్ట్రాంగ్ రూముల పక్కనే ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లాలోని శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాలకు సంబంధించిన ఇవిఎంలను ఆర్‌జిఎం ఇంజినీరింగ్ కళాశాలలో భద్రపరిచారు. ఆళ్లగడ్డ, బనగానపల్లె, నంద్యాల నియోజకవర్గాలకు సంబంధించిన ఇవిఎంలను శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో భద్రంచేశారు. డోన్ నియోజకవర్గానికి సంబంధించిన ఇవిఎంలను శాంతిరాం ఫార్మసీ కళాశాలలో భద్రపరిచారు.

స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూముల పర్యవేక్షణకు సిసి కెమెరాల కమాండ్ కంట్రోల్‌ను ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూముల మూడంచెల భద్రతలో మొదటి స్థాయిలో కేంద్ర సాయుధ బలగాలు, రెండో స్థాయిలో ఆర్మ్‌డ్ రిజర్వుడు బలగాలు, తృతీయ స్థాయిలో సివిల్ పోలీసు బలగాలను మోహరింపచేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంది. ప్రతి స్ట్రాంగ్ రూమ్, పరిసరాల్లో సిసి టివి కెమెరాలతో ప్రత్యేక నిఘా ఉంచారు. ప్రతి స్ట్రాంగ్ రూమ్ వద్ద కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతో గస్తీ ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌లకు ఉన్నతస్థాయి అధికారులను ఇంన్‌ఛార్జీలుగా నియమించారు. ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ఫైర్ ఇంజిన్లను కూడా ఏర్పాటు చేశారు. విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్లు కూడా ఏర్పాటు చేశారు. అత్యంత కట్టుదిట్టమైన భద్రతతో జూన్ 4న ఓట్ల లెక్కింపు జరిగే వరకు దృశ్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు చర్యలు చేపట్టారు. స్ట్రాంగ్ రూమ్‌లు తెరిచే ముందు, మూసివేసే సమయంలో సిసి టివి కవరేజ్, వీడియోగ్రఫీ మొత్తం సీలింగ్ ప్రక్రియ స్పష్టంగా కనిపించే విధంగా సిసి టివిలు ఏర్పాటు చేశారు. అభ్యర్థుల భవితవ్యం ఇవిఎంల్లో నిక్షిప్తమైంది. ఓట్ల లెక్కింపు సమయంలో అభ్యర్థుల భవితవ్యం ఏమిటో తేలనుంది.



రాయలసీమ యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూములను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ (ఫైల్)

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జూన్ 4వ తేది జరగనున్న కౌంటింగ్‌కు సంబంధించి కౌంటింగ్ హాలులో చేయాల్సిన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన సంబంధిత రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక రాయలసీమ యూనివర్సిటీలోని కంట్రోల్ రూంలో స్ట్రాంగ్ రూమ్ లైవ్ ఫీడ్‌ను పరిశీలించిన అనంతరం ఇవిఎమ్ యంత్రాలను భద్రపరచిన ఇంజనీరింగ్ బ్లాక్‌ను, కౌంటింగ్ హాల్ ను జిల్లా ఎస్‌పితో కష్ణకాంత్, జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ హాలులో ఏ విధంగా టేబుల్స్, చైర్లు ఏర్పాటు చేసుకుంటే సౌకర్యంగా ఉంటుందో చూసుకోవాలని రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ సూచించారు. కౌంటింగ్ హాలులో ఏర్పాటు చేయనున్న టేబుల్స్, చైర్లను ముందుగా సంబంధిత రిటర్నింగ్ అధికారులు అందరికీ చూపించాలని, రిటర్నింగ్ అధికారులు అంగీకరించిన అనంతరం రిటర్నింగ్ అధికారుల సమక్షంలో కౌంటింగ్ హాల్లో ఏర్పాటు చేయించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. వివి ప్యాట్ కౌంటింగ్ బూత్ ఏ విధంగా ఏర్పాటు చేయనున్నారనే విషయాన్ని రిటర్నింగ్ అధికారులకు తెలియచేసే విధంగా వివి ప్యాట్ కౌంటింగ్ బూత్ ఒకటి మోడల్ గా ఏర్పాటు చేసి సంబంధిత రిటర్నింగ్ అధికారులకు చూపించాలని ఆర్అండ్‌బి ఎస్ఇని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్, పాణ్యం రిటర్నింగ్ అధికారి నారపురెడ్డి మౌర్య, అసిస్టెంట్ ట్రైని కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు ఆర్‌డిఒ, కోడుమూరు రిటర్నింగ్ అధికారి శేషి రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఇ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు మండలం ఇ తాండ్రపాడు గ్రామంలో ఏప్రిల్ 3న ఏడు గడ్డివాములు అగ్నికి ఆహుతి అయి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, గ్రామ సర్పంచి బాలపీర ఆధ్వర్యంలో బాధిత రైతులు డిఆర్‌ఒను విన్నవించారు. ఈ మేరకు డిఆర్ఒ మధుసూదన్‌రావుకు సోమవారం వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జి రామకృష్ణ మాట్లాడుతూ అసలే కష్టకాలంలో ఉన్న రైతులు తమ పశువులను పోషించుకోలేక అనేక రకాల ఇబ్బందులు పడుతున్నటువంటి సమయంలో విలువైన చొప్ప, గడ్డి వాములు అగ్నికి ఆహుతి కావడం బాధాకరమైన విషయమన్నారు. ప్రభుత్వం తక్షణమే రైతులను ఆదుకునేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. గడ్డివాములు కాలిపోయిన రైతులు పెద్దబజారి, టికే శేషన్న ,చిన్న బజారి, వేణుగోపాల్ ,పులేందర్, కే ధర్మయ్య, టి శ్రీనివాసులు, వీరందరి గడ్డివాములు కాలి బూడిద అయిపోయాయన్నారు. వీరిలో పెద్ద బజారి సంబంధించిన సెంట్రింగ్ సామాను కూడా సుమారుగా రూ.40 వేల విలువచేసే సామాను మొత్తం బుడదైపోయిందన్నారు. పులేందర్ అనే రైతు చింత చెట్టు కూడా అగ్నికి ఆహుతి అయిపోయిందన్నారు. చొప్పవాములు ,చింత చెట్టు ,సెంట్రింగ్ సామాను మొత్తం కలిపి సుమారు రూ.పది లక్షల దాకా రైతులు నష్టపోయారన్నారు. ఈ విషయాన్ని వెంటనే స్థానిక తహశీల్దార్‌కు రైతులు, గ్రామ సర్పంచి బాలపీరా ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ మానవతా దృక్పథంతో స్పందించి రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని రామకృష్ణ, బాలపీర కోరారు .డిఆర్ఒ సానుకూలంగా స్పందిస్తూ మీ విజ్ఞాపనను కలెక్టర్‌కు పంపించి న్యాయం చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



డిఆర్ఒ మధుసూదనరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇసుక అక్రమ తవ్వకాలు జరిపితే

కఠిన చర్యలు

- ఇసుక రీచ్‌లను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



ఇసుక రీచ్‌లను తనిఖీ చేస్తున్న కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి - సి బెళగల్

న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను పాటించకుండా ఇసుకను అక్రమ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సజన తెలిపారు. సోమవారం సి.బెలగల్ మండలంలోని కె.సింగవరం, ఈర్లదిన్నె, ముడుమాల, పల్‌దొడ్డి గ్రామాలలోని ఇసుక రీచ్‌లను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక అక్రమ తవ్వకాలను ఎప్పటికప్పుడు అడ్డుకునేందుకు ఇసుక రీచ్‌లలో సిసి కెమరాలను ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాకుండా పోలీసు, రెవెన్యూ సిబ్బంది సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అక్రమ ఇసుక తవ్వకాలు జరపకూడదని, అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాలను కూడా సీజ్ చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా పల్‌దొడ్డి గ్రామంలోని తుంగభద్ర నది తీరంలోని ఇసుక రీచ్‌లో మోటర్లు ఉండటం గమనించిన జిల్లా కలెక్టర్ వాల్టయాక్ట్ చట్ట ప్రకారం మోటర్ల ద్వారా నీటిని తొలగించడం చట్ట విరుద్ధమని వెంటనే సదరు మోటర్లను తొలగించాలని కలెక్టర్ సి.బెళగల్ తహశీల్దార్‌ను అదేశించారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు ఆర్‌డిఒ శేషిరెడ్డి, ఇరిగేషన్ ఎస్ఇ రెడ్డి శేఖర్ రెడ్డి, మైనింగ్ డిడి రాజశేఖర్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ నాగేశ్వరరావు, విజిలెన్స్, భూగర్భ జలశాఖ అధికారి, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.



డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాలలపైన చర్యలు తీసుకోవాలని కర్నూలు డిఇఒకు ఎస్ఎఫ్ఐ బృందం వినతి పత్రం ఇచ్చింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగప్ప అబ్దుల్లా మాట్లాడుతూ కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలు పెద్ద పెద్దగా పేపర్ ప్రకటనలు పెద్ద హోర్డింగులు అడ్వర్టైజ్‌మెంట్లు ఇస్తూ విద్యార్థుల ఇల్లు దగ్గరికి వెళ్లి ముందుగానే జాయిన్ అయితే ఫీజులో రాయితీ ఇస్తామని దాంతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులను ప్రలోభాలకు గురి చేస్తున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుండి రకరకాల పేర్లతో వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. అలా ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న కేశవరెడ్డి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, నారాయణ, చైతన్య , భాష్యం స్కూలు, శ్రీ లక్ష్మీ స్కూల్ ల పైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి ఉదయ్ జిల్లా కమిటీ సభ్యుడు గౌస్ తదితరులు పాల్గొన్నారు.



ఒత్తిడిని అధిగమించే యోగా

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్


ఒత్తిడిని అధిగమించేందుకు విద్యార్థులకు యోగా సాధన ఉపకరిస్తుందని రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి అన్నారు. సోమవారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, కర్నూలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జోహారాపురం లోని ఇందిరమ్మ కాలనీలోని వేసవి యోగా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా యోగా సాధన చేస్తే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని అన్నారు. అనంతరం చిన్నారులకు కర్నూలు జిల్లా యోగా సంఘం ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని అందజేశారు.

భద్రత ఏది?

-నగర శివారులో కొరవడుతున్న రక్షణ-పెరుగుతున్న నేరాలు
-పోలీసు గస్తీలోనే లోపమా?-నగరవనంలో పనిచేయని సిసి కెమెరాలు
-విచ్చలవిడిగా బహిరంగ మద్యపానం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : కర్నూలు నగర శివారులో ప్రజలకు భద్రత కొరబడుతోంది. శనివారం గార్గేయపురం చెరువు పరిసరాల్లో బయటపడిన మహిళల మృతదేహాలే అందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఒకేసారి ముగ్గురు మహిళలు శవాలై తేలడంతో ఇటు నగర ప్రజలు, అటు శివారు ప్రాంత ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు. తమకు భద్రత ఏది అన్న ప్రశ్న ప్రజల నుంచి వినిపిస్తోంది. నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో గార్గేయపురం చెరువు చుట్టుపక్కల నగరవనం, రియల్‌ఎస్టేట్ వెంచర్లు కోకొల్లలుగా వెలుస్తున్నాయి. జనం తాకిడి కూడా రోజురోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో గస్తీని పెంచడంలో పోలీసులు తీవ్రంగా వైఫల్యం చెందుతున్నారనే విమర్శ ప్రజల నుంచి ఎదురవుతుంది.

నిద్రిస్తున్న నిఘా నేత్రాలు : నగరవనం పర్యాటక కేంద్రంగా ఉండడం కారణంగా ఆహ్లాదం కోసం, వినోదం కోసం ప్రతిరోజు వందలాదిమంది యువకులు, మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి నిత్యం సందర్శిస్తూ ఉంటారు. చెరువు చుట్టుపక్కల ప్రకృతి అందాలను వీక్షించేందుకు ప్రజల తాకిడి మెండుగానే ఉంటుంది. ఈ పరిస్థితుల్లో చుట్టుపక్కల పోలీసు నిఘా పెంచాల్సి ఉంది. పోలీసు నిబంధనల ప్రకారం జనం గుమిగూడే ప్రదేశాల్లో సిసి కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. ఈ మేరకు స్థానికంగా నగరవనంలో మూడు సిసి కెమెరాలను అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. కాగా గత కొంతకాలంగా ఈ సిసి కెమెరాలు పనిచేయడం లేదని తెలుస్తోంది. కెమెరాలు పనిచేయకపోవడం వల్ల నేరస్తులు తమ పనిని సులభంగా పూర్తి చేసుకొని జారుకునేందుకు అవకాశం లభిస్తుంది. నగరవనం అధికారులు అనుసరిస్తున్న అలసత్వం పట్ల ప్రజలు తీవ్ర విమర్శలను గుప్పిస్తున్నారు. చాలా సందర్భాల్లో సిసి కెమెరాలు నేరస్తులను పట్టించడంలో ఎంతో ఉపయోగంగా ఉంటున్నాయి. సిసి కెమెరాలు లేనందున నేరాలు జరిగిన సందర్భంలో నేరస్తులను గుర్తించేందుకు వీలు లేకుండా పోయే అవకాశం ఉంది. అటు పక్కనే ఎపి టూరిజం వారి ఆధ్వర్యంలో బార్ నిర్వహిస్తున్నారు. అనేకమంది మందుబాబులు చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో బహిరంగంగానే మద్యం సేవిస్తున్నారు. మందు సేవించి పారేసిన ఖాళీ సీసాలు పరిసర ప్రాంతంలో విచ్చలవిడిగా దర్శనమిస్తున్నాయి. ఇదే పరిసర ప్రాంతాల్లో పలువురు పోకిరీలు సైతం ఇక్కడికి వచ్చి అమ్మాయిల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తూన్నట్లు తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితులు చక్కదిద్దాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది. ఇప్పటికైనా పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టి ఇలాంటి నేరాలను, ఘటనలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.



అందుబాటులో లేని సచివాలయ ఉద్యోగులు

ఇబ్బందుల్లో చెన్నంపల్లి ప్రజలు

ప్రజాశక్తి-తుగ్గలి : తుగ్గలి మండలం చెన్నంపల్లి గ్రామ సచివాలయంలోఉద్యోగులు అందుబాటులో లేకపోవడంతో ఆ గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజల సమస్యలను స్థానికంగా పరిష్కరించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తెచ్చింది. అయితే చెన్నంపల్లి సచివాలయంలో ఉద్యోగులు తమ విధులకు సక్రమంగా రాకపోవడంతో ఆ గ్రామ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సచివాలయానికి వస్తున్నారు. సచివాలయ ఉద్యోగులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు వెనుతిరిగి వెళుతున్నామని వాపోతున్నారు. సోమవారం వివిధ సమస్యలపై గ్రామస్తులు సచివాలయానికి రావడంతో డిజిటల్ అసిస్టెంట్ తప్ప ఏ ఉద్యోగి అక్కడ లేకపోవ డంతో ఆ గ్రామ ప్రజలు సచివాలయ ఉద్యోగులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు . ప్రజలకు అందుబాటు లేకుండా విధులకు డుమ్మా కొట్టడం ఏమిటని స్థానిక ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్న తాధికారులు స్పందించి సచివాలయం ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరయ్యే విధంగా చూడాలని ప్రజలు కోరుతునానరు.

వివరణ: ఈ విషయంపై డిడిఒ పంచాయతీ కార్యదర్శి రాజు నాయక్‌ను వివరణ కోరగా ప్రజల నుండి ఫిర్యాదులు అందడం వాస్తవమేనని, ఈ విషయాన్ని ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్లి విధులకు డుమ్మా కొడుతున్న సచివాలయం ఉద్యోగులు పై తగు చర్యలు తీసుకుంటామన్నారు.

ఇందిరా గాంధీ నగర్ చెత్తమయం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరం మార్కెట్ యార్డ్ పక్కన ఉన్న ఇందిరాగాంధీ నగర్ నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికుల నిర్లక్ష్యంతో చెత్తమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇందిరా గాంధీ నగర్‌లోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద పరిసర ప్రాంతాల ప్రజలు తెచ్చిపడేసిన చెత్తాచెదారం వ్యర్థ పదార్థాలు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులతో ఒక గుట్టలాగా తయారైంది. సుమారు ఒక ట్రాక్టర్ అయ్యే విధంగా పేరు పోయింది. వర్షం పడితే చెత్త కుళ్ళి కంపు కొడుతుంది. అంతేకాక బ్రిడ్జి మూసివేయడంతో అక్కడ పిచ్చి మొక్కలు మొలసి తేళ్ళకు, పాములకు ఆవాసంగా తయారైంది. అవార్డు కార్పొరేటర్ మునెమ్మ కూడా ఏమాత్రం పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోయారు. ఆ ప్రాంతంలో పారిశుధ్య పనులు చేసే వారు కూడా ఐదు నెలలైనా రాకుండా వదిలేయడంతో చెత్త పేరుకు పోయింది. అక్కడ నీటి కొళాయిలో ఉండడంతో మంచినీళ్ల కోసం పెద్దపాడు నుండి కూడా ఆటోలో వచ్చి తీసుకుని వెళు తుంటారు. తాగునీటి కొళాయిలు ఉండే ప్రాంతంలో చెత్తాచెదారంతో పేరుకుపోవడంతో ప్రజలకు రోగాలు వచ్చే అవకాశం ఉంది. దేనికి తోడు ఆ ప్రాంతంలోని ప్రజలు బట్టలను కూడా ఇక్కడే ఉతుకుతుంటారు. ఈవిషయం కార్పొరేటరుకు తెలిపినా, పారిశుద్ధ కార్మికులకు తెలిపిన ఏమాత్రం పట్టించుకోవడంలేదని వాపోయారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి ఈ ప్రాంతంలో చెత్తను శుభ్రం చేయాలని కోరుతున్నారు.



చెత్తకుప్పల మధ్యనే ఇందిరాగాంధీ వాసుల జీవనం

తేళ్లు, పాములు వస్తున్నాయి
కళ్యాణి ఇందిరాగాంధీ నగర్



చెత్తాచెదారంతో నిండి పోవడంతో ఈ ప్రాంతంలో తేళ్లు పాములు వస్తున్నాయి. వర్షం వచ్చిందంటే అవి వచ్చి మనుషులను ఎక్కడ కాటేస్తాయోనని భయమేస్తుంది. అధికారులు వీలైనంత త్వరగా చెత్తను శుభ్రం చేయాలి.

చెత్తను రాత్రి పడేసి పోతున్నారు
రామాంజనేయులు, ఇందిరాగాంధీ నగర్



చెత్తను ఇక్కడ పడేయవద్దని ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదు. పగలు చెత్తను పడేస్తే చూసి అరుస్తారని రాత్రిపూట తెచ్చి పడేసి పోతున్నారు. కనీసం వారానికోసారైనా చెత్తను శుభ్రం చేయాలి. అధికారులు పట్టించుకోవాలి.



మాట్లాడుతున్న లెక్కల మాస్టర్ ఈశ్వరయ్య

విద్యార్థులకు గణితం దిక్సూచి : ఈశ్వరయ్య

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యార్థులకు గణితం దిక్సూచి లాంటిదని లెక్కల మాస్టారు ఈశ్వరయ్య అన్నారు. సుందరయ్య స్ఫూర్తికేంద్రం ఆధ్వర్యంలో ప్రజాశక్తిఎడిషన్ కార్యాలయంలో విద్యార్థులకు నిర్వహించిన వేసవి ఉచిత మ్యాథమేటిక్స్ బోధనలో ఆయన మాట్లాడారు. శాస్త్ర, సాంకేతిక రంగాలలో విద్యార్థులు రాణించాలంటే గణితం కీలకమన్నారు. గణితం ఆట, పాటలతో సులభశైలిలో నేర్పుతామన్నారు. ప్రారంభ కార్యక్రమంలో సుందరయ్యస్ఫూర్తికేంద్రం కన్వీనర్ జెఎన్.శేషయ్య, నాయకులు టి.నరసింహా, ఎన్.అలివేలు, బసవయ్య, రంగస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

విషాహారం తిని
16 మందికి అస్వస్థత
- కలుషిత నీరు కారణం కాదన్న అధికారులు
- గ్రామంలో పర్యటించిన వైద్యాధికారులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని ఇస్వి గ్రామంలో విషాహారం తిని 4 కుటుంబాలకు చెందిన 16 మంది అస్వస్థతకు గురయ్యారు. గ్రామంలో కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురయ్యారని సోషల్ మీడియాలో వీడియో వైరల్ కావడంతో సోమవారం ఇస్వి గ్రామంలో అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయి అధికారులు, డిప్యూటీ డిఎంహెచ్ఒ సత్యవతి మాట్లాడారు. కలుషిత నీరు తాగి 30 మందికి పైగా అస్వస్థతకు గురయ్యారని సోషల్ మీడియాలో వైరల్ కావడంతో గ్రామంలో పర్యటించామని తెలిపారు. కలుషిత నీరు కారణం కాదని, గ్రామంలో ఒక ఫంక్షన్‌లో నాలుగు కుటుంబాలు కలిసి చికెన్, పలావ్ వండుకొని తిన్నారని చెప్పారు. రాత్రి తినడంతో పాటు మరుసటి రోజు కూడా తినడంతో నాలుగు కుటుంబాలకు సంబంధించి 16 మంది అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారని చెప్పారు. అందులో ఏడుగురిని డిశ్చార్జ్ చేయగా మిగతా వారు కూడా ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. గ్రామంలో పారిశుధ్య పనులు పరిశీలించి, తాగునీటిని కూడా ల్యాబ్‌కు పంపించామని చెప్పారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో కాలం చెల్లిన మందులు ఉన్నాయని, మరో వీడియో రావడంతో అధికారులు హుటాహుటిన ఆరోగ్య కేంద్రానికి చేరుకొని తనిఖీ చేశారు. అక్కడ కాలం చెల్లిన మందులు, సిరప్‌లు లేవని, ఏదో 1, 2 ఉంటే వాటిని పడేసేందుకు స్థానిక ఆశావర్కర్లకు సూచించామని తెలిపారు. గ్రామంలో ఎవరూ అతిసార బారిన పడలేదని, ముందస్తు చర్యగా అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. పెద్దహరివాణం పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ ఇమ్రాన్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి నాగమల్లయ్య, ఇన్‌ఛార్జ్ ఇఒఆర్‌డి నాగరాజ్, ఎంపిహెచ్ఇఒ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి చంద్ర కళావతి బాయి, ఎఎన్ఎం విజయలక్ష్మి, సిహెచ్ఒ పద్మావతి పాల్గొన్నారు.

రాఘవేంద్ర నగర్‌కు తాగునీరివ్వాలి
- కమిషనర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని 32వ వార్డు సంజీవ్ నగర్ పక్కనున్న రాఘవేంద్ర నగర్ వాసులకు తాగునీరు అందించాలని సిపిఎం నాయకులు పి.గోవిందు, బి.రాముడు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈనెల 14 తర్వాత ఎమ్మిగనూరు మున్సిపాలిటీ సిబ్బంది పట్టణ వాసులకు రోజు విడిచి రోజు తాగునీరు ఇస్తున్నారని తెలిపారు. పట్టణ శివారులో ఉన్న స్లమ్ ఏరియాలకు తాగునీటి పైపులైన్ కూడా వేయలేదని చెప్పారు. 32వ వార్డు సంజీవ్ నగర్ పక్కన ఉన్న రాఘవేంద్ర నగర్ ప్రజలకు తాగునీటి పైపులైన్ ఇప్పటివరకు వేయలేదన్నారు. కాలనీ వాసులకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందిస్తున్నారని తెలిపారు. అందరికీ నీరు అందడం లేదన్నారు. అదనంగా తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి మాట్లాడుతూ... త్వరలోనే రాఘవేంద్ర నగర్‌కు తాగునీటి పైపులైన్ వేయిస్తామని తెలిపారు. అలాగే కాలనీ వాసులకు సరిపోయే తాగునీరు ట్రాక్టర్, ట్యాంకర్ల ద్వారా అందజేస్తామని చెప్పారు. పట్టణంలో తాగునీటి సమస్య జటిలం కాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు కమిషనర్‌ను కోరారు. సిపిఎం నాయకులు తిమ్మప్ప, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఆస్పరిలో తాగునీటి సమస్య
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు - నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి

ప్రజాశక్తి - ఆస్పరి

మేజర్ పంచాయతీ అయిన ఆస్పరిలో నీటి సమస్య జఠిలంగా ఉంది. ప్రజలు గుక్కెడు నీటి కోసం పుట్టెడు కష్టాలు పడుతున్నారు. గత కొన్ని రోజులుగా నీటి సమస్య తీవ్రత కావడంతో గ్రామస్తుల బాధలు వర్ణాతీతం. బీసీ కాలనీలో నీళ్లు రాకపోవడంతో ఎద్దులు బండ్లు, మోటార్ బైక్, సైకిల్ ఉన్న వారు స్థానిక గాంధీ పార్కు వద్ద గుమ్మిల దగ్గరకు వెళ్లి నీళ్లు తెచ్చుకొని సేద తీర్చుకుంటున్నారు. గత్యంతరం లేక ప్రజలు ఫిల్టర్ వాటర్ ఒక్క బిందె రూ.7, ట్యాంకర్ రూ.800 పెట్టి కొనుక్కొని తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామంలో 7వ వార్డు పోలీసు క్వార్టర్స్ కాలనీకి నీళ్లు రాక మూడు నెలలు కావస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పంచాయతీ అధికారులు గతనెల 26న ఒక్క ట్యాంకర్ పంపారు. అప్పటి నుంచి నేటి వరకు నీళ్లు రాక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. చొక్కనహళ్లి రోడ్డులోని శ్మశాన వాటిక దగ్గర ఉన్న బోరు నుంచి నీరు వచ్చేవి. అవి రాకపోవడంతో కర్నూలు రోడ్డులోని నాగమ్మవ్వ దేవాలయం దగ్గర ఉన్న బోరు నీళ్లు ఆ వార్డుకు లైన్ కలిపారు. బోరు నీళ్లు ఫ్లోరైడ్ ఉప్పు నీళ్లు అని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చెప్పినప్పటికీ వాడుకోవడానికి ఏమీ కాదులే అంటూ పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు అంటున్నారు. ఆ నీళ్లు పశువులు కూడా తాగడం లేదు. స్నానం చేస్తే ఒళ్లంతా నూనె లాగా పేరుకుపోతోంది. అలాంటి నీటిని రోజు ఉదయం, సాయంత్రం వదులుతున్నప్పటికీ కాలనీ వాసులు పట్టుకోవడం లేదు. ఈ విషయాన్ని అధికారులు, సర్పంచి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. గ్రామాల్లోని మౌలిక వసతులు కల్పిస్తామని, తాగునీటి సమస్యలు పరిష్కరిస్తామని పాలకులు ఆర్భాటంగా హామీలు ఇచ్చినప్పటికీ మాటలకే పరిమితమయయ్యే తప్ప ఆచరణలో మాత్రం శూన్యమని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఆ ఉప్పు నీళ్లు బోరు వదలకుండా కాలువ నీళ్లు వదిలితే బాగుంటుందని కాలనీవాసులు కోరుతున్నారు. గత నెల 26న ఆ వార్డుకు ఒక్క ట్యాంకర్ పంపినందుకు ఎందుకు పంపారంటూ పంచాయతీ అధికారులపై సర్పంచి భర్త ఆగ్రహం వ్యక్తం చేశారని సమాచారం.



ఎద్దులబండ్లపై నీటిని తీసుకెళ్తున్న ప్రజలు



చేతి పంపు వద్ద నీటి కోసం వేచి ఉన్న ప్రజలు

తాగునీరు సరఫరా చేయాలి
- సిపిఎం మండల కార్యదర్శి హనుమంతు



7వ వార్డు కాలనీ వాసులకు తాగునీరు సరఫరా చేయాలి. గ్రామంలో నీటి ఎద్దడిని నివారించేందుకు పంచాయతీ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలి. నీటి సమస్యను తలెత్తకుండా తగిన చర్యలు చేపటాలి. లేకపోతే మహిళలతో కలిసి కార్యాలయాన్ని ముట్టడిస్తాం.

రహదారిపైనే మురుగునీరు
- దుర్వాసన భరించలేకపోతున్నాం - ఇరువైపులా డ్రెయినేజీ నిర్మించాలి
- ఏరూరు గ్రామస్తుల డిమాండ్

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని ఏరూరు గ్రామ ప్రధాన రహదారిపై మురుగునీరు ప్రవహిస్తోంది. దుర్వాసన భరించలేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుకిరువైపులా డ్రెయినేజీ నిర్మించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న మహిళలు ఎక్కువ శాతం తమ ఇంట్లో నుంచి వృథా నీటిని బయటకు తెచ్చి రహదారులపై చల్లుతుంటారు. వారికి అధికారులు ఎన్నిసార్లు చెప్పినా ఆ అలవాటును మానలేకపోతున్నారు. ఇంటి చుట్టూ పరిసరాలు బాగుంటే ప్రజల ఆరోగ్యాలు కూడా బాగుంటాయని తెలుసుకోలేకపోతున్నారు. ఏరూరు గ్రామానికి ఏ బంధువు వచ్చినా తప్పనిసరిగా ఈ మురుగునీటి రహదారిని చూసి నివ్వెర పోతుంటారు. గ్రామంలోకి ప్రవేశించినప్పటి నుంచి చివరి వరకు నిల్వ ఉన్న మురుగునీటిలోనే నడవాల్సి వస్తోంది. ప్రజలు నడవడానికి కూడా ఇబ్బంది ఉన్నప్పుడు రహదారికి ఇరువైపులా నివాసం ఉన్న గృహాల వారు ఎంత ఇబ్బందులకు గురవుతున్నారో అర్థం చేసుకోవచ్చు. శుద్ధి జల కేంద్రంలో వృథా నీటిని కూడా రహదారి వెంటే వదులుతున్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా ఇంకుడుగుంత మాదిరి చేసుకుంటే మంచిదని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. అలాగే రజకులు నివాసం ఉన్న కాలనీలో బయటికి రావాలంటేనే భయమేస్తోందని, తప్పనిసరిగా మురుగునీటిలో అడుగు పెట్టాల్సిందేనని, ఈ దుర్వాసన భరించలేకపోతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు, మహిళలు మురుగునీటిలో పడిన సందర్భాలు అనేకం. ఒక టీచరు ద్విచక్ర వాహనం అదుపు తప్పి మురుగునీటిలో పడ్డారని ఆ కాలనీవాసులే తెలుపుతున్నారు. నిల్వ ఉన్న మురుగునీటి వల్ల దోమలు వ్యాప్తి చెంది అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని మహిళలు, ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు, రక్షిత మంచినీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. నష్టం జరిగాక మొక్కుబడిగా పనులు చేస్తున్నారే తప్ప శాశ్వత చర్యలు లేవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక గ్రామాల్లో సిసి రోడ్లు వేశారు కానీ, మురుగునీరు పోయేందుకు కాలువలు నిర్మించలేదు. వర్షాకాలం వస్తే ప్రజలు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుకిరువైపులా డ్రెయినేజీలు నిర్మించాలని, అప్పుడే తమ కాలనీ రహదారి అంతా పరిశుభ్రంగా ఉంటుందని, అధికారులు, పాలకులు వెంటనే డ్రెయినేజీ కాలువలు నిర్మించాలని ఏరూరు గ్రామ మహిళలు, ప్రజలు కోరుతున్నారు.



ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

రోడ్లపైనే మురుగునీరు
- సమస్యలకు నిలయం చిన్నతుంబళం

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని చిన్నతుంబళం సమస్యలకు నిలయంగా మారింది. సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేక రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. మురుగు నీరు రోడ్లపై ప్రవహించడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. పరిశుభ్రత లోపించడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో తాగునీరు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. పదిరోజుల అయినా తాగునీరు రావడం లేదు. అది కూడా కొన్ని కాలనీలకు మాత్రమే అందుతోంది. గత్యంతరం లేక ప్రజలు తాగునీటిని డబ్బులు పెట్టి కొనుకునే దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

విత్తనాలు, ఎరువులు
అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు
- ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, ఎఒ హేమలత

ప్రజాశక్తి - గోనెగండ్ల

విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు విక్రయించే డీలర్లు, షాప్ యజమానులపై చర్యలు తీసుకుంటామని ఎమ్మిగనూరు ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, గోనెగండ్ల ఎఒ జి.హేమలత హెచ్చరించారు. సోమవారం గోనెగండ్లలోని రైతు భరోసా కేంద్రంలో మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందు దుకాణాల డీలర్లు, యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విత్తన డీలర్లు వచ్చిన ప్రతి విత్తనానికీ తప్పనిసరిగా సోర్స్ సర్టిఫికెట్, ఇన్వాయిస్‌లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఎంఆర్‌పి ధరల కంటే అధిక ధరలకు విక్రయించరాదని చెప్పారు. స్టాక్ వివరాలు, ధరల పట్టిక నోటీసు బోర్డుపై డిస్‌ప్లే ఉంచి స్టాక్ రిజిస్టర్ రోజూ అప్‌డేట్ చేయాలని సూచించారు. కో మార్కెటింగ్ విత్తనాలు అమ్మరాదని, అలా విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేదశ్రీ మధుసూదన రెడ్డి, జైకిసాన్ మద్దిలేటి, మహేష్, ధరణి స్వామి, ఉరుకుంద, ఫయాజ్, తులసి మూర్తి, గంజిహళ్లి నిజాం పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి
- ఎఒ వరప్రసాద్

ప్రజాశక్తి - పెద్దకడబూరు



రైతులు సబ్సిడీ విత్తనాల కోసం ఆర్‌బికెలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎఒ వరప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలానికి 200 క్వింటాళ్ల వేరుశనగ, 11 క్వింటాళ్ల జీలుగ, 3 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు సబ్సిడీ కింద మంజూరైనట్లు తెలిపారు. వేరుశనగ విత్తనాలు క్వింటా పూర్తి ధర రూ.9,500, 40 శాతం సబ్సిడీతో రైతు వాటా రూ.5,700 చెల్లించాలని చెప్పారు. జీలుగ విత్తనాలు క్వింటా రూ.8,800 కాగా 50 శాతం సబ్సిడీతో రైతు వాటా రూ.4,400 చెల్లించాలని తెలిపారు. పిల్లి పెసర విత్తనాలు క్వింటా రూ.13,400 కాగా 50శాతం సబ్సిడీతో రైతు వాటా రూ.6,700 చెల్లించి స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆయా రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకొన్న రైతులకు సబ్సిడీ విత్తనాలు అందిస్తున్నట్లు వెల్లడించారు.

వైభవంగా శ్రీఖాదర్ లింగస్వామి గంధోత్సవం



గంధోత్సవంలో పాల్గొన్న భక్తులు

ప్రజాశక్తి - కౌతాళం

మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి గంధోత్సం వైభవంగా సాగింది. సోమవారం రాత్రి అశేష భక్తుల ఆధ్వర్యంలో గంధోత్సవం వైభవంగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫకీర్ సాబ్‌లను గ్రామ పొలిమేర నుంచి ఊరేగింపుగా వచ్చి దర్గా ఆవరణంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు.

భారీగా తరలివచ్చిన భక్తులు

శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి ఉరుసు సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. స్థానికులతో పాటు ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి గంధోత్సవంలో భక్తులు పాల్గొన్నారు. దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నా పాషా చిస్తి భక్తులకు అని సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

రౌడూరు వరకు బస్సు నడపాలి
- సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - కౌతాళం

ఆదోని నుంచి ఎరిగేరి బదినేహాళ్, కుంటనహాళ్ మీదుగా రౌడూరు గ్రామం వరకు బస్సు నడపాలని సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో చాలా గ్రామాలకు సర్వీస్ బస్సులను ఆర్‌టిసి డిఎం రద్దు చేసి, ప్రయివేట్ వాహనాలను (ఆటోలు, టెంపుల్) ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. గతంలో ఆదోని నుంచి కడితోట, జి.హోసళ్లి, బదినేహాళ్ మీదుగా రౌడూరు వరకు 5 సింగిల్స్ బస్సు నడిచేదని తెలిపారు. ఆ బస్సు నడిచేటప్పుడు రైతులకు, ప్రయాణికు లకు, విద్యార్థులకు, వ్యాపారులకు అనుకూలంగా ఉండేదని చెప్పారు. బదినేహాళ్ దగ్గర బ్రిడ్జి వర్షానికి పడిపోవడంతో బస్సు రద్దు చేశారని తెలిపారు. బదినేహాళ్ గ్రామం వద్ద బ్రిడ్జి పునర్నిర్మించి సంవత్సరమైనా ఆ బస్సును పునరుద్ధరించ లేదని చెప్పారు. బస్సు లేకపోవడంతో ప్రయాణికులు గత్యంతరం లేక ప్రయివేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నా రని తెలిపారు. ప్రమాదాలు జరుగుతున్నా యని తెలిసినా ఆటోలు ఎక్కి ఆదోనికి రావాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఆర్‌టిసి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా రౌడూరు బస్సును పునరుద్ధరించడం లేదని తెలిపారు. కుంటన హాళ్ నుంచి ఆదోనికి వెళ్లాలంటే ఫస్ట్ బస్సు లేకపోవడం వల్ల గ్రామస్తులు పెద్దహరివాణం కానీ, కౌతాళం కానీ ద్విచక్ర వాహనంపై వచ్చి బస్సుకు పోవాల్సిన దుస్థితి ఏర్పడిందని చెప్పారు. ఆర్‌టిసి అధికారులు స్పందించి ఆదోని నుంచి కడితోట, జి.హోసళ్లి, బదినేహాళ్ మీదుగా రౌడూరు వరకు 3 సింగిల్స్, ఆదోని నుంచి ఎరిగేరి, బడినేహాళ్ మీదుగా రౌడూరు వరకు 2 సింగిల్స్ నడపాలని డిమాండ్ చేశారు. లేకపోతే గ్రామాల ప్రజలను సమీకరించి ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సిపిఎం మండల కన్వీనర్ బి.ఈరన్న, ఉల్లిగయ్య, వీరయ్య స్వామి, వన్నూర్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌టిఆర్ పుట్టినరోజు వేడుకలు



ఆదోనిలో కేక్ కట్ చేస్తున్న అభిమానులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ఎన్‌టిఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం జూనియర్ ఎన్‌టిఆర్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదోనిలోని రాజశ్రీ థియేటర్ లో భారీ కేక్ కట్ చేసి సంబరం జరుపుకున్నారు. ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ కెఎం.ముజీబ్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.చాంద్ బాష మాట్లాడారు. ప్రతేడాది వివిధ సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేద అభిమానులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. అభిమాన హీరో ఆయురా రోగ్యాలతో మరిన్ని పుట్టినరోజు వేడుకలు నిర్వహించు కోవాలని ఆకాంక్షించారు. అనంతరం జూనియర్ ఎన్‌టిఆర్ సేవా సమితి పెద్దహరివాణం యువకుల ఆధ్వర్యంలో ఆదోనిలోని జీవన జ్యోతి ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. నందమూరి సీనియర్ అభిమానులు వెంకటేష్, రాజు, సుబ్బు, కోసిగి నరసన్న, సేవా సమితి సభ్యులు శీను, గుణ, చక్రి, నాగేంద్ర, నవీన్, చిన్నా, వీరేంద్ర, శంకర్, మహేష్, పవన్, మల్లేష్, కార్తీక్, సందీప్, తిక్కయ్య, గర్జప్ప, భారీ సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు. **కౌతాళంలో** జూనియర్ ఎన్‌టిఆర్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్‌టిఆర్ అభిమాన సంఘం అధ్యక్షులు బసవరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం సేవా కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. నాగరాజు గౌడ్, అశోక్ గౌడ్, నరేంద్ర గౌడ్, నరసింహ గౌడ్, ఉమేష్, యూసుఫ్, హుసేని, చంద్ర పాల్గొన్నారు.



కౌతాళంలో పండ్లు, బ్రెడ్లు అందజేస్తున్న అభిమానులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ నిరంజన్ రెడ్డి

గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే చర్యలు
- తాలూకా సిఐ నిరంజన్ రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని తాలూకా సిఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో సిఐ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించి, తనిఖీలు చేపట్టారు. గ్రామ సచివాలయం సమీపంలో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణులు ప్రశాంతంగా జీవితాలను గడపాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాలతో 144 సెక్షన్ అమలు చేస్తున్నామని, ఇరుపార్టీల నేతలు జూన్ 4 వరకు సమన్వయం పాటించాలని తెలిపారు. గ్రామంలో యువకులు సమన్వయం పాటించాలన్నారు. యువకులు కేసులో ఇరుక్కుని జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఇరు పార్టీ నాయకులు అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కర్ణాటక మద్యం అమ్మే వారి ఇంటిని, గ్రామంలో ఉన్న ధాబాలను, గతంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా టపాసులు, పేలుడు పదార్థాలను తయారు చేసి అమ్మే వారి ఇళ్లను, రౌడీ షీటర్స్ సస్పెక్ట్‌లను తనిఖీ చేశారు. గ్రామ వీధుల్లో సిబ్బందితో కవాతు నిర్వహించి, ముఖ్యమైన కూడలిలో మీటింగులు ఏర్పాటు చేశారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత కూడా గ్రామంలో ఎవరూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకూడదని తెలిపారు. అనంతరం పెట్రోల్, డీజిల్ బాటిళ్లలో వ్యాపారం చేసే వారికి ఎన్నికల కమిషన్ ఆదేశాలతో కౌన్సెలింగ్ నిర్వహించి, తగిన సూచనలు చేశారు. ఎస్ఐలు శ్రీనివాసులు, చిన్న పీరయ్య, ఎర్రి స్వామి, ఇస్వి, పెద్దతుంబళం, తాలూకా పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టు విరిగి బాలుడు మృతి

ప్రజాశక్తి - ఆలూరు

హాలహర్వి మండలం విరుపాపురం గ్రామానికి చెందిన శాంతమ్మ, బసవరాజు దంపతుల కుమారుడు సంతోష్ (9) ఆదివారం రాత్రి చెట్టు విరిగి పడి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు... గ్రామంలోని చెట్టు కింద పిల్లలు ఆడుకుంటుండగా గాలివాన కురవడంతో అక్కడున్న చెట్టు కిందికి పిల్లలు వెళ్లారు. ఆ సమయంలో చెట్టు విరిగి సంతోష్‌పై పడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన మరో బాలుని మెరుగైన చికిత్స నిమిత్తం ఆలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

రోడ్డుకు గుంత
- ఇరువైపులా కంపచెట్లు
- శంకర్ నగర్ రోడ్డుకు లైట్లు ఏర్పాటు చేయాలి



రోడ్డుకు పడిన గుంత

పట్టణంలోని శంకర్‌నగర్ రోడ్డుకు గుంత పడింది. రోడ్డుకిరువైపులా కంపచెట్లు పెరగడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకిరువైపులా వీధి లైట్లు లేవు. రాత్రి పూట వాహనదారులు అదుపు తప్పి గుంతల్లో పడిన సందర్భాలు కూడా ఉన్నాయి.

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలోని శివారులో ఏర్పాటు చేసిన శంకర్ నగర్‌కు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా వీధిలైట్ల సౌకర్యం లేదు. ఆలూరు రోడ్డులోని శంకర్ నగర్ లేబర్ కాలనీ స్కూల్ వద్ద రోడ్డు కలవనుంది. ఈఎస్ఐ ఆస్పత్రి రైల్వే ట్రాక్ అవతల సాయి నగర్ మీదుగా ఏర్పాటు చేసిన ఈ రోడ్డు ప్రస్తుతం వాహనాల తాకిడితో నిత్యం రద్దీగా ఉంటుంది. రోడ్డుకిరువైపులా కంప చెట్లు పెరిగిపోయాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. రోడ్డుకిరువైపులా ఏపుగా ఉన్న కంప చెట్లను తొలగించి చదును చేయాల్సిన అవసరం ఉంది. రాత్రి వేళలో చీకటి ఉండడం వల్ల వాహనాలు అదుపు తప్పే ప్రమాదం ఉందని పలువురు వాపోతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

రైల్వే ట్రాక్ సెయింట్ ఆంథోని హైస్కూల్ అవతల ఉన్న ఈ రోడ్డుకు గుంత ఏర్పడింది. వేగంగా వచ్చే ద్విచక్ర వాహనదారులు గుంతను గమనించకుండా అటుగా పోనిస్తే అదుపు తప్పి కింద పడిన సందర్భాలు ఉన్నాయి. సెయింట్ ఆంథోని హైస్కూల్ బోర్డు ఏర్పాటు చేసిన చోటనే రోడ్డుకు గుంత ఏర్పడింది. ప్రమాదాలు జరగకుండా గుంతను పూడ్చి రోడ్డుకిరువైపులా వీధిలైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.